ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 17 జూలై 2024





సీఎం సమావేశంలో పాల్గొన్న అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మానుకోటలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి



రోగిని తరలించేందుకు పేషెంట్ కేర్‌టేకర్‌లేక బంధువులే వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

జిల్లా ఆస్పత్రికి సమస్యల జబ్బు

అస్తవ్యస్తంగా సర్కారు దవాఖాన

- పనిచేయని వాటర్, ఆక్సిజన్ ప్లాంట్లు
- పడకేసిన పారిశుధ్యం, అపరిశుభ్రంగా హాస్పటల్ ప్రాంగణం
- అవస్థలు పడుతున్న రోగులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నెహ్రూసెంటర్, జూలై 16 : ప్రజలకు పెద్దదిక్కుగా ఉన్న మానుకోట పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో సమస్యలు తాండవిస్తున్నాయి. దవాఖానలో పూర్తిగా సౌకర్యాలు లేక, అరకొర వసతుల మధ్య రోగులకు సేవలు అందుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మహబూబాబాద్‌లోని జిల్లా ఆస్పత్రిగా ఉన్నతీకరణ చెందిన తర్వాత.. 21 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు (పీహెచ్‌సీలు), మూడు సీహెచ్‌సీలు, ఒకటి అర్బన్ పీహెచ్‌సీ, 173 హెల్త్ సబ్‌సెంటర్లు, 18 మండలాల ప్రజలకు సౌకర్యార్థం ఉండే విధంగా.. 330 పడకలకు విస్తరింప చేశారు. దీంతో ఆస్పత్రికి రోగులసంఖ్య భారీ పెరిగింది. రోజూ 1000-1200 మంది రోగులు జనరల్ వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. వర్షాకాల సీజన్ కావడంతో దవాఖానకు వచ్చే రోగులసంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో రోగులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. స్త్రీ, పురుషుల ఓపీ కౌంటర్‌లు వేర్వేరుగా ఉన్నప్పటికి తాకిడితో అస్పత్రి ఆవరణం మొత్తం ఎటు చూసినా కిక్కిరిసి పోతోంది. కానీ, రోగుల సంఖ్యకు తగ్గట్లుగా కనీస మౌళిక వసతులు కల్పించడంలో సంబంధిత వైద్యాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోగులకు కల్పించాల్సిన సౌకర్యాలను కల్పించకుండా జాప్యం చేస్తున్నారు. రోగులు, వారి తరుపున వచ్చే బంధువులకు కనీసం తాగడానికి మంచినీరు లేక అవస్థలు పడుతున్నారు.

పూర్తిస్థాయి సిబ్బంది లేక..

శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతూ.. వచ్చే రోగులకు ఆక్సిజన్ సిలిండర్‌లు లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆపరేషన్ థియేటర్‌లో సరిపడ సిబ్బందిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతోండడంతో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ఎమర్జెన్సీ వాహనాలు అస్పత్రి లోపలికి రాలేకపోతున్నాయి. పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయడంతో ఆస్పత్రి ఆవరణం మొత్తం అపరిశుభ్రంగా కన్పిస్తోంది. పరిసరాలు మొత్తం దుర్వాసన వెదజల్లుతోంది. రోగులకు వాడిన ఇంజక్షన్‌లు, సెలెన్ బాటిళ్లను ఆస్పత్రి సమీపంలో వేయడంతో ఒకరి నుంచి మరొకరికి రోగాలు సోకే ప్రమాదం ఉందని రోగులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో మహబూబాబాద్ జిల్లాలోని చాలామంది రోగులు సర్కార్ ఆస్పత్రిని వదిలేసి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని బహటంగానే విమర్శలు విన్పిస్తున్నాయి.

తాగునీటికి తండ్లాటే..

మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోజూ వేలమంది ప్రజలు రోగులు, వారి బంధువులు వైద్యపరీక్ష కోసం వస్తున్నారు. వారికి కనీసం తాగేందుకు మంచినీరు లేక అవస్థలు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న వాటర్‌ప్లాంట్ చాలా కాలంగా పనిచేయకుండా మూలనపడింది. ఇటువైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. 2022లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రి పరిధిలో ప్రారంభించిన ఆక్సిజన్‌ప్లాంట్ కొద్దిరోజులకే మూతపడింది. దీనిపై సైతం అధికారులు సమాలోచన చేయడం లేదు.



రోగులకు ఉపయోగించిన ఇంజక్షన్, సెలెన్ బాటిళ్లు ఇవే

పరిసరాలు అధ్వానం

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పారిశుద్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడి చెత్తాచెదారం అక్కడే వేయడంతో పరిసరాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారి కంపు కొడుతున్నాయి. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాల్సిన సాయి గ్రూప్ సిబ్బందికి సరైన అవగాహన లేక వాడిన ఇంజక్షన్‌లు, సెలెన్ బాటిళ్లను కాకతీయ బయో మెడికల్ వాహనంలో అధికారుల పర్యవేక్షణలో తరలించాల్సి ఉంది. అయితే ఆలా చేయకుండా మునిసిపాలిటీ వాహనంలో వేసి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనే పడేస్తుండడంతో ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే అధికారుల పర్యవేక్షణలో ఇంజక్షన్, సెలెన్ బాటిళ్లను కాకతీయ బయో మెడికల్ వాహనంలో తరలించాలని కోరుతున్నారు.

అపరేషన్ థియేటర్‌లో..

మహబూబాబాద్ జిల్లా మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వివిధ రకాల సర్జరీల కోసం రోగులు, గర్భిణీలు దవాఖానకు వస్తున్నారు. కానీ, ఆపరేషన్ థియేటర్‌లో సరిపడ సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నట్లు రోగులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్యులు మినహా కిందిస్థాయి క్యాడర్ సియా అమ్ టెక్నీషియన్స్, అనస్థిషియా అసిస్టెంట్, ఓటి అటెండర్‌లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండెంట్ తీసుకువచ్చే వారు లేక పడరాని పాట్లు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. తక్షణమే ఆపరేషన్ థియేటర్‌లలో సరిపడ సిబ్బందని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరించాలి



గుగులోతు భీమానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

జిల్లా ప్రభుత్వ జనరల్ అస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. రోగులకు రోజూ అందించాల్సిన మెనూ ప్రకారం భోజనం అందించాలి. దవాఖానకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం సేవలు అందించాలి. ఆపరేషన్ థియేటర్‌లో సరిపడ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. అస్పత్రి ఆవరణ మొత్తం పరిశుభ్రంగా ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

సమస్యలను పరిష్కరిస్తున్నాం..



డాక్టర్ జగదీష్, జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటికిగా సవరించి, పరిష్కరిస్తున్నాం. వాడిన ఇంజక్షన్‌లు, సెలెన్ బాటిళ్లను బయట వేస్తున్నారన్న విషయం నా దృష్టికి రాలేదు. అలా చేయకుండా చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రి ఆవరణాన్ని సిబ్బంది పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం. ఎన్నికల కోడ్‌వల్ల సిబ్బంది ఏర్పాటులో జాప్యం జరిగింది. త్వరలోనే మెడికల్ కళాశాల ప్రాసెస్ ప్రకారం ఆపరేషన్ థియేటర్‌లో కిందిస్థాయి సిబ్బంది ఏర్పాటు చేస్తాం.



మూతపడిన ఆక్సిజన్ ప్లాంట్



దవాఖాన ఆవరణలో ఇష్టమొచ్చినట్టు నిలిపిన ద్విచక్రవాహనాలు (ఫైల్)

జిల్లా కలెక్టర్లతో సీఎం సమావేశం

- హాజరైన అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ

మహబూబాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. వివిధ అంశాలపైవా రితో చర్చించారు. జిల్లాలవారీగా రైతు రుణమాఫీపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పాల్గొన్నారు.



లక్ష మందికి రూ.2లక్షల రుణమాఫీ అవకాశం

జిల్లాలో రైతులకు రూ.1000 కోట్ల మేరకు లబ్ధి

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 16 : రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ మహబూబాబాద్ జిల్లాలో లక్ష మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. సుమారు రూ.1000 కోట్లు రుణమాఫీ అయ్యే అవకాశాలు కనపడుతున్నాయి. రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం కాంగ్రెస్‌పభుత్వం విడుదల చేసిన విషయం విధితమే. సర్కారు ముందుగా ప్రకటించిన సమయంలో 1.40 లక్షల మంది రైతులకు రూ.1,650 కోట్లు రుణమాఫీ అవుతుందని జిల్లా లీడ్‌బ్యాంకు అధికారులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ మార్గదర్శకాల విడుదలతో ఆ సంఖ్య తగ్గే అవకాశాలు కన్పిస్తున్నాయి. 12 డిసెంబరు 2018 తర్వాత మంజూరైన రుణాలకు 9 డిసెంబరు 2023 వరకు

మిగతా 8వ పేజీలో..

మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ, జూలై 16 : మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ తెలిపారు. మంగళవారం మరిపెడ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గుగులోత్ సింధూర కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ అమృత్ సిటీ పథకం ద్వారా రూ.25 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రెయినేజీ వ్యవస్థను చక్కదిద్దాలని సూచించారు. పలువురు వార్డు కౌన్సిలర్లు వారివారి వార్డులలో నెలకొన్న సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. వీధిలైట్ల ఏర్పాటు, అంతర్గత రోడ్ల మరమ్మత్తులపై చర్యలు లేవని వాపోయారు. ప్రతీ వార్డుకు అంతర్గత రోడ్ల మరమ్మతు కోసం రూ.లక్ష చొప్పున కేటాయించాలని వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, వార్డుకౌన్సిలర్లు పానుగోతు సుజాత, ఎడెల్లి పరశరాములు, బానోత్ శ్రీను, హథిరామ్, బయ్య భిక్షం, రేఖ లలిత, మాచెర్ల స్రవంతి, వూరుకొండ శ్రీను, కౌసల్య డిమాండ్ చేశారు. కాగా, వనమహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మునిసిపల్ కార్యాలయంలో మొక్కలునాటారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి, ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ మునిసిపల్ కార్యాలయంలో మొక్క నాటి, నీరు పోస్తున్న జాటోత్ రాంచంద్రునాయక్

నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా నిలుపుదాం

- 8 నెలల్లో రూ.80 కోట్ల అభివృద్ధి నిధులు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 16 : నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రంలో రోల్‌మోడల్‌గా నిలుపుదామని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. మానుకోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 99మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ప్రజా సంక్షేమపథకాలు అమలవుతున్నాయని చెప్పారు. ఏనిమిది నెలల్లో మానుకోట నియోజకవర్గానికి రూ.80కోట్ల నిధులు మంజూరయ్యాయని, తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లో మనమే ముందంజలో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రతీ కాలనీకి పైపులైన్ వేసి, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. కేసముద్రం, గూడూరు మండల కేంద్రాల్లోని ప్రధాన రహదారుల్లో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరైన తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు రైతుబంధు ఇచ్చారని, కాంగ్రెస్ పాలనలో క్యాబినెట్ సబ్ కమిటీ వేశారని, రైతులను నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారని, సాగుచేసే భూమిని గుర్తించి రైతు బంధు ఇవ్వనున్న ట్లు పేర్కొన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయని, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం మానుకోట పట్టణం చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం మునిసిపల్ ఫ్లోర్ లీడర్లు వెన్నం లక్ష్మారెడ్డి, బి.అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, నీరుటి లక్ష్మీనారాయణ, పోతురాజు రాజు, భూక్య శ్రీను, నీరుటి సురేష్‌నాయుడు, హరిసింగ్, కోడి శ్రీను, దండెబోయిన బుజ్జి వెంకన్న, ఎడ్ల రమేష్, ఖలీల్‌పాషా, ఆరెందుల వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి జగన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మానుకోటలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న భూక్య మురళీనాయక్

ఫాతిమా హైస్కూల్‌లో గ్రంథాలయం ప్రారంభం..

మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ప్రారంభించారు. స్కూల్ విద్యార్థులకు వివిధ విభాగాల లీడర్‌షిప్ బ్యాడ్జీలు, డ్రెస్ కోడ్‌లను బహూకరించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కను నాటారు. కాంగ్రెస్ అర్బన్ అధ్య క్షుడు ఘనపురపు అంజయ్య, వార్డు కౌన్సిలర్ హరిసింగ్, శంతన్ రామరాజు, నారాయణసింగ్, శ్రావణ్, చరణ్ పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూలై 16: భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేసి హత్యచేసిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ వరంగల్ ప్రధాన సెషన్స్ జడ్జి బి. నిర్మలా గీతాంబ మంగళవారం తీర్పు వెలు వరించారు. అదే విధంగా భార్యను శారీరకంగా, మానసికంగా హింసించిన కేసులో మూడు సంవత్సరాల జైలు, రూ. వేయి జరిమానా విధించారు. కాగా ఈ రెండు శిక్ష లు ఏకకాలంలో అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బండకింది తం డాకు చెందిన భూక్యా గోపాల్ కూతురు రమను అదే మండలం జయరాం తం డాకు చెందిన లావుడ్యా శ్రీనుకు 20 సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం జరిపిం చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెళ్లైన కొంత కాలానికి మద్యానికి బాని సై భార్యపై అనుమానంతో నిత్యం వేధిస్తుండేవాడు. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించి నచ్చచెప్పారు. అయినప్పటికీ నిందితుడిలో మార్పు రాకపోవడంతో రమ 22ఏప్రిల్ 2016లో ఉమెన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇది ఇలా ఉండగా 1 జూలై 2016న ఆమెను నమ్మించి వ్యవసాయ భూమిలో పత్తి గింజలు పెట్టడానికి తీసుకెళ్లాడు. మర్నాడు అనగా 2 జూలై 2016న కూడా వ్యవసాయ పనులకు తీసుకెళ్లి పనుల అనంతరం ఇంటికి వచ్చారు. ఇం ట్లోనే గొడవ సృష్టించి ఆమెను విపరీతంగా కొట్టి కిరోసిన్ పోయగా ఆమె అరుస్తూ బయటకు పరుగులు తీసింది.

అయినప్పటికీ వెంటపడి అగ్గిపెట్టెతో నిప్పంటించగా గ్రామస్తులు చూసి మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో కాలిన గాయాలతో ఉన్న రమను ఆస్పత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతూ 5 జూలై 2016న మరణించింది. దీంతో నిందితుడు లావుడ్యా శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ. 4 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ.సోమునాయక్ సాక్షులను ప్రవేశపెట్టగా ఏసీపీ ఎల్. ఆదినారాయణ, సీఐ సూర్యప్రకాష్ కేసు దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తున్న రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ జమునాదేవి, బిందుశ్రీ

వరంగల్ మెడికల్, జూలై 16 : రాష్ట్ర ఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండలోని పలు స్కానింగ్ సెంటర్లలో రాష్ట్ర మానిటరింగ్ కమిటీ బృందం డాక్టర్లు జమునాదేవి, బిందుశ్రీ ఆకస్మిక తని ఖీ నిర్వహించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం నియ మాలను పాటి స్తున్న తీరు, అనుమతి పత్రాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చట్టరీత్యా నిషేధమని ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాలికల నిష్పత్తి తగ్గుతున్న నేపథ్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తనిఖీ విషయాలను కమిషనర్ కుటుంబ సంక్షేమశాఖకు అందజేస్తామని పేర్కొన్నారు. స్కానింగ్‌కు వచ్చిన గర్భిణులు, వారి సహాయకులతో మాట్లాడి వారు ఇచ్చిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ మంగమ్మ, డీఈవో సందీప్‌లు పాల్గొన్నారు.

నాబార్డు ద్వారా రూ.460 కోట్ల రుణాలు

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 16 : నాబార్డు ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ రైతు సేవా సహకార సంఘాలకు వివిధ వ్యాపారాల నిర్వహణ కోసం రూ.460 కోట్లు మంజూరు అయినట్లు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. మంగళవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకులో కమర్షియల్, రీజినల్ రూరల్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల జోనల్ వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలు, పెట్రోల్ పంప్స్ రైస్ మిల్లులు తదితర వ్యాపారాలను సహకార సంఘాలు నిర్వహించుకొని తద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు నాబార్డు రుణాలు మంజూరు చసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జీయం ఉషా, సీఈవో వజీర్ సుల్తాన్, పౌల్ట్రీ ఫామ్స్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు పాల్గొన్నారు.

కేయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రాంగణ నియామకాలు

కేయూక్యాంపస్, జూలై 16: కేయూ కెమిస్ట్రీ విభాగం నేతృత్వంలో హైదరాబా ద్‌లోని జినోమ్ వ్యాలీ యూరోఫిన్స్ అడ్వినాస్ డిస్కవరీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈసందర్భగా కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. సవితాజ్యోత్స్న మాట్లాడుతూ..ఇంటర్వ్యూలకు 8 మంది ఎంపిక య్యారని వీరిలో ఆర్ట్స్ కళాశాల, ఐదేళ్ళ ఇంటిగ్రేటెడ్ కోర్సుల విద్యార్థులున్నారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 15 వేల పారితోషికం చెల్లిస్తారని వివరించారు.

కేయూలో బాధ్యతలు చేపట్టిన అధికారులు

కేయూ క్యాంపస్, జూలై 16 : కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియం త్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు ఇప్పటి వరకు అదనపు పరీక్షల నియంత్రణా ధికారిగా పనిచేసిన డాక్టర్ చాడ రాధికారెడ్డి నుంచి బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. అలాగే కాకతీయ యూనివర్సిటీ కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా రాధికా రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజ నీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రమణ,, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. బిక్షాలు, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి . జగన్మోహన్‌రాజులు ఆయా విభాగాల అధిపతు లుగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కేయూక్యాంపస్, జూలై 16 : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యా ర్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, వర్సిటీ ప్రతిష్ఠను పెంచాలని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరటి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం బీఫా ర్మసీ చివరి ఏడాది విద్యార్థుల వీడ్కోలు సమావేశం కేయూ ఫార్మసీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రతిష్ఠ ఖండాం తరాలకు వ్యాపించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో మన కళాశాల విద్యార్థులు ప్రధాన భూమిక వహిస్తున్నా రని కొనియాడారు. కేయూ పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ ప్రాం గణ నియామకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెలకువలను నేర్పిం చారు.

వాహనాలు లోపల.. అర్జీదారులు బయట

ఐనవోలు, జూలై 16: ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో వాహనాల పార్కింగ్‌తో అర్జిదారులు కూర్చోవడం కాదు కదా నిల్చోవడానికి స్థలం లేకుండా పోతోంది. వివిధ గ్రామాల నుంచి పనుల కోసం కార్యాలయానికి వచ్చే అర్జిదారులు కుర్చోవడానికి కుర్చీలు లేక నిలబడటానికి స్థలంలేక ఇబ్బందులు పడుతుంటే సందేట్లో సడేమియాల ఉద్యోగులు సిబ్బంది తమ ద్విచక్రవాహనా లను ఏకంగా బిల్డింగ్ ఆవరణలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో భవనం లోపల ఉండాల్సిన అర్జిదారులు ఆరు బయట నిల్చుంటున్నారు. ఆరు బయట ఉండా ల్సిన వాహనాలు భవనంలో లోపల ఉండడం గమనార్హం. తహసీల్దార్ చొరవ తీసుకొని కార్యాలయానికి వచ్చే అర్జిదారుల కోసం బెంచీలు వేయించి వాహ నాల పార్కింగ్‌ను భవనం బయట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సకల శుభాలు కలిగించే తొలి ఏకాదశి

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, జూలై 16 : హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యమున్న తొలి ఏకాదశి పర్వాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో ఆచరించు కునేందుకు జిల్లా ప్రజలు సమాయత్తమ య్యారు. ఆషాఢమాసంలో శుక్లపక్షాన వచ్చే ఏకాదశి నుంచే దక్షణాయపర్వం ప్రారంభం కానుంది. గుమ్మాలకు తోరణాలు కట్టి ఇష్ట దైవాలైన వేంకటేశ్వరస్వామి, క్షీర సముద్రంలో లక్ష్మీ సమేతుడై ఉన్న శ్రీమన్నారాయణుడిని కొలవడడంతో పాటు ఉపవాసం ఉంటే అన్ని కార్యాలు నెరవేరుతాయన్నది విశ్వాసం. మహా సాధ్వి సతి సక్కుబాయి ఈ వ్రతాన్ని ఆచరించే మోక్షసిద్ధి పొందిందని, దీంతో పాటు మౌనం ఉండటం ఉదయాన్నే విష్ణు సహస్ర నామ పారాయణం వినడం, ఉదయం విష్ణు ఆలయాన్ని ప్రదోశకాల సమయంలో శివాలయాలను సందర్శించడం, సందర్శించిన వారికి మంచి ఫలితాలు ఉంటాయన్నది ఈ ఏకాదశి పర్వదిన విశేషం. విష్ణుమూర్తి పాల కడలి యోగా నిద్రలోకి వెళ్లే సందర్భాన్ని సయన ఏకాదశి అని కూడా పిలవడం ఆనవాయితీ. వేంకటేశ్వరస్వామికి ఎర్రని పూలతో, తులసీ దళాలతో పూజలు చేస్తే సత్ఫలితాలు ఉంటాయని నమ్మకం.

పూలకు భలే గిరాకీ..

తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో అలంకరణలు, ప్రత్యేక పూజలతో పాటు ప్రజలు ఇళ్లల్లో కూడా పండుగ వేడుకలను నిర్వహించుకుంటారు. ఈ క్రమంలో పూలకు గిరాకీ పెరిగింది. మంగళవారం కిలో మల్లెపూలు రూ.వేయి పలుకగా, చామంతులు కిలో రూ. 400, గులాబీలు కిలోకు రూ.300 పలికాయి. వర్షాల నేపథ్యంలో పూలు కూడా తక్కువగా వచ్చినా.. అధిక ధరలున్నా పండుగ కోసం పూలను కొనుగోలు చేశారు.

ముస్తాబైన ఆలయాలు..

ఏకాదశి పర్వదిన ప్రత్యేక పూజల కోసం ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. అలాగే వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయం, బట్టల బజార్‌లోని బాలానగర్ వేంకటేశ్వర ఆలయం, జేపీఎన్ రోడ్డు గీతా భవన్ కృష్ణ మందిరం, వేంకటేశ్వరాలయం, కాశిబుగ్గ శ్రీరంగనాథ స్వామి దేవాలయం, డాక్టర్స్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆకారపు వారి గుడి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, ఇస్కాన్ శ్రీకృష్ణ మందిరం, పోతన రోడ్డు మురళీకృష్ణ మందిరంతో పాటు నర్సంపేటలోని వేంకటేశ్వరస్వామి, దుగ్గొండిలోని వేంకటేశ్వరాలయం, కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి, రాయపర్తి సన్నూరులోని వేంకటేశ్వర ఆలయాల్లో అభిషేకాలు, అలంకరణలకు ఏర్పాట్లు చేశారు. కరీమాబాద్ ప్రాంతంలోని బీరన్న దేవాలయంలో బోనాల పండుగను నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి పర్వదినాల రోజున ఎలాంటి ఆహారం భుజించకుండా ఉపవాస దీక్ష చేస్తే భగవత్ అనుగ్రహం కలుగుతుందని నమ్మకం. ఇక కొన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు ఈ ఏకాదశిని పెద్ద ఏకాదశి అని పిలుస్తారని, పిండి వంటలతో మాంసాన్ని కూడా భుజిస్తారట. సంప్రదాయ బద్ధంగా పెద్ద ఏకాదశి పండుగ రోజున కంచంలో బొక్కను కొట్టే ఆచారాన్ని పాటిస్తారట.

సమధర్మం, త్యాగానికి ప్రతీక మొహర్రం

నేడు పీర్ల పండుగ

జఫర్‌గఢ్, జూలై 16 : సుమారు 14 శతాబ్దాల క్రితం ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పరిరక్షణ కోసం జరిగిన చరిత్రాత్మక పోరాటమే మొహర్రం. హిజ్రీ క్యాలండర్ ప్రకారం నూతన సంవత్సర ఆరంభ మాసమే మొహర్రం. ఈ నెల ఆరంభం నుంచి ఇస్లాం కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. శాంతి, సమధర్మం, మానవత్వానికి ప్రాణం పోసిన ధీరుడు, మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్. ప్రేమ మూర్తిగా, ధర్మశాస్త్ర ప్రావీణ్యుడిగా ప్రజలను కాపాడేందుకు అత్యంత ధైర్య సాహసాలతో తన తోటి వారిని ముందుకు నడిపి ప్రశంసలందుకున్నారని ప్రతీతి. ప్రవక్త తెచ్చిన ఇస్లాం ధర్మాన్ని నిర్వీర్యం చేస్తున్న ఇరాక్ రాజు యజీద్ తనకు మద్దతు ఇవ్వాలని ఇమామ్ హుస్సేన్‌ను కోరగా, తాను ప్రజాస్వామ్య పాలన కోసం ప్రజల వైపే నిలబడతానన్నారని, ఇమామ్ హుస్సేన్ తన పరివారంతో కలిసి కుఫాకు బయలుదేరుతున్న విషయాన్ని తెలుసుకున్న యజీద్.. తన సైన్యాన్ని పంపించి ఇరాక్ సమీప ప్రాంతంలోని కర్బలా మైదానంలో అడ్డుకుని పది రోజుల పాటు యుద్ధం సాగించాడని చెబుతుంటారు. ఇందులో ఇమామ్ హుస్సేన్ బంధువర్గం 72 మంది వీరోచితంగా పోరాటం చేసి మరణించారు. పదో రోజు ఒక్కడిగా మిగిలిన హుస్సేన్ శత్రువుల అనుమతితో ప్రార్థన చేస్తున్న సమయంలో వెన్నుపోటు పొడిచి సంహరించడంతో వీర మరణం పొందాడు. ఈ ఘట్టాన్ని స్మరిస్తూ ఏటా సంప్రదాయబద్ధంగా మొహర్రం నిర్వహిస్తున్నారు. ఇమామ్ హుస్సేన్ వీర మరణానికి నిదర్శనంగా చావిడిలో పీర్లను తయారు చేసి ఉంచి 9 రోజుల పాటు పూజిస్తారు. చదివింపులు, పూజలను కుల మతాలకతీతంగా నిర్వహిస్తారు. 10వ రోజున తెల్లవారు జామున అగ్నిగుండంలోకి పీర్లు ప్రవేశించి ఊరంతా గ్రామోత్సవం పేరుతో ఊరేగిస్తారు. ప్రాణత్యాగం చేసిన ఉదంతాన్ని షహదత్‌గా (మొహర్రం)గా జరుపుతారు.



జఫర్‌గఢ్ మండలం తిమ్మాపూర్‌లో పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం

నేడు పీర్ల ఊరేగింపులు..

మొహర్రం సందర్భంగా నూతన వస్త్రాలతో అందంగా ముస్తాబు చేసిన పీర్లను బుధవారం జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఊరేగిస్తారు. అసయ్ దులా.. అంటూ డప్పు చప్పుళ్లతో వీధుల్లో.. ఇంటింటికీ తిరుగుతారు. ప్రజలు భక్తితో పీర్లకు పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకుని భక్తితో కానుకలను సమర్పిస్తారు. పీర్ల ఊరేగింపు సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. మధ్యాహ్నం చావడి వద్దకు, సాయంత్రం వేళల్లో గ్రామ చివర పొలిమేర్లకు హిందూ - ముస్లింలు కలిసి పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ పీర్లను శోభా యాత్రగా తీసుకువెళతారు.

ఆలిండియా పారా అథ్లెటిక్స్‌లో

జిల్లా క్రీడాకారుడికి స్వర్ణం

1500 మీటర్ల పరుగులో అకీరానందన్ సత్తా



వరంగల్ స్పోర్ట్స్, జూలై16: పారా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహిస్తున్న ఆలిండియా పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో హనుమకొండకు చెందిన అకిరానందన్ సత్తా చాటి స్వర్ణ పతకం సాధించాడు. అండర్ 19 బాలురు 1500 మీటర్ల పరుగు పందెంలో రాణించిన అకీరానందన్ ప్రథమ స్థానంలో నిలిచాడు. హనుమకొండ జేఎన్ఎస్ లోని సింథటిక్‌ట్రాక్‌లో కోచ్ సారంగపాణి వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఆలిండియా పారా అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన అకీరానందన్ జిల్లా కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేశాడని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, జిల్లా, రాష్ట్ర పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అకిరానందన్‌ను అభినందించారు.

ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్‌గా రామ్‌ప్రకాశ్



శంభునిపేట, జూలై16: మామునూరులోని టీఎస్ఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్‌గా బి.రామ్‌ప్రకాశ్ నియమితుల య్యారు. మంగళవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లి 7వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న రామ్ ప్రకాశ్‌ను ఇటీవల డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కాగా వరంగల్‌లోని మామునూరులోని 4వ బెటాలియన్‌కు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగిస్తూ పోలీసు శాఖ రామ్‌ప్రసాద్‌ను బదిలీ చేసింది. అయితే ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం 5వ బెటాలియన్ కమాండెంట్ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి 4వ బెటాలియన్ కమాండెంట్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా మంగళవారం ఆయన నుంచి రామ్‌ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్, ఏఓ నిర్మల, యూనిట్ వైద్యురాలు అన్వేషిణి, ఆర్‌ఐలు శోభన్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, రమేష్, ఏపీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్, కిరణ్, అశోక్, కృష్ణ ఉన్నారు.

రుణమాఫీతో ఉమ్మడి జిల్లాలో

78,432 రైతులకు లబ్ధి



హనుమకొండ సిటీ , జూలై 16 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు పరిధిలో 78,432 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. డీసీసీ బ్యాంకు పరిధిలోని బ్రాంచిలు, సహకార సంఘాల నుంచి రుణాలు పొందిన రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తొలుత రూ. 2 లక్షల రుణమాఫీ ఏక కాలంలో చేయనున్నట్లు ప్రకటించింది. కానీ ప్రస్తుతం 18వ తేదీన లక్ష రుణ మాఫీ అని ప్రకటించడంతో కాస్త ఆయోమయం నెలకొంది. అయితే మరో లక్ష రుపాయల రుణం అంటే మొత్తంగా 2 లక్షల రూపాయల రుణ మాఫీ వివరాలు ముున్ముందు వెల్లడి కావచ్చని బ్యాంకు అధికారులు అంటున్నారు. ఇప్పటికే టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు పరిధిలోని 78,432 రైతుల రుణమాఫీకి సంబంధించిన వివరాలను అందచేశారు. 18వ తేదీన రుణమాఫీకి సంబంధించిన లక్ష రూపాయలు రైతుల ఖాతాల్లో జమ కానున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రైతు వేదికల్లో రుణమాఫీ లబ్దిదారులతో సంబురాలు ఉండడంతో అధికారగణం సిద్ధమవుతోంది.

'పదహారుచింతల్ తండా' కుటుంబానికి కేటీఆర్ అండ

చెన్నారావుపేట, జూలై 16: ఇటీవల వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారుచింతల్ తండాలో ప్రేమోన్మాది చేతిలో తల్లిదండ్రులను కోల్పోయి, గాయపడిన గిరిజన అన్నాచెల్లెలికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అండగా నిలిచారు. మంగళవారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆ ఇద్దరిని తీసుకొని హైదరాబాద్‌లో కేటీఆర్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈనెల 12న యువకుడు కత్తితో జరిపిన దాడిలో తల్లిదండ్రులను కోల్పోయి.. గాయపడిన ఇద్దరు పిల్లలకు అండగా ఉంటామని, వారి చదువుల కోసం ఖర్చులను భరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు రూ.50లక్షల సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. నిందితుడు నాగరాజుకు కఠిన శిక్ష పడేలా డీజీపీకి ఆదేశాలు ఇవ్వాలని కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బాధిత కుటుంబానికి తాము రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మాజీ సర్పంచ్ బానోతు శారదగణేష్ తదితరులు పాల్గొన్నారు.




బాధిత అక్కాతమ్ముడిని పరామర్శిస్తున్న కేటీఆర్

ప్రముఖ ఉర్దూ కవి తాజ్‌ముక్తార్

కన్నుమూత

పలువురి సంతాపం



తాజ్ ముక్తార్ (ఫైల్)

హనుమకొండ కల్చరల్, జూలై 16 : సుప్రసిద్ధ ఉర్దూ కవి కాళోజీ సోదరులకు అత్యంత ఆప్తుడు అయిన హనుమకొండకు చెందిన తాజ్ ముక్తార్ (88) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందడంపై కాళోజీ ఫౌండేషన్, మిత్ర మండలి వరంగల్ రచయితల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షులు రామశాస్త్రి, కార్యదర్శి వి.ఆర్.విద్యార్థి మాట్లాడుతూ.. ఆదర్శ భావాలుగల కవి, కుల మతాలకు అతీతంగా గొప్ప కవిత్వాన్ని సృజించారని ఆయన మృతి ఉర్దూ సాహిత్యానికి తీరని లోటని, ఓరుగల్లు సాహితి ప్రపంచంలో ఆయన లోటు ఎవరూ భర్తీ చేయలేనిదని పేర్కొన్నారు. ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, కేయూ తెలుగు విశ్రాంత ఆచార్యులు బన్న ఐలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజిత, మహ్మద్ సిరాజుద్దీన్, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం పక్షాన బిల్లా మహేందర్, నెల్లుట్ల రమాదేవి, కార్తీకరాజు, బాలబోయిన రమాదేవి, గట్టు రాధిక, వల్లపైడి తదితరులు కూడా వేర్వేరుగా సంతాపం వ్యక్తం చేశారు.

మక్కలు, పత్తికి రికార్డు ధర

ఏనుమాములలో క్వింటా మక్కలు రూ.2,725, పత్తి రూ. 7,350

మట్టెవాడ, జూలై 16: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న, పత్తికి రికార్డు ధర పలికింది. మొక్కజొన్న క్వింటాకు రూ.2,725 ధర, పత్తి క్వింటాకు రూ. 7,350 ధర పలికింది. మార్కెట్ చరిత్రలోనే మొక్కజొన్నలకు ఇంత ధర పలకడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరగడంతో రూ. 7,350 చేరినట్లు వ్యాపారులు తెలిపారు.

మక్కలకు, పత్తికి ధర పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జూలైలో మొక్కజొన్నలు, పత్తి ధర మార్కెట్‌లో రోజు రోజుకు పెరుగుతుంది. దీంతో మార్కెట్‌లో క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

లింక్ క్లిక్ చేశాడు.. రూ.96వేలు పోగొట్టుకున్నాడు..

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 16: జనగామ జిల్లాలో ఓ యువకుడు సైబర్ వలలో పడ్డాడు. వాట్సాప్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేసి రూ.96వేలు పోగొట్టుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన పోకల రాజేష్ అనే యువకుడి ఫోన్‌కు ఈ నెల 15వ తేదీన సైబర్ నేరగాళ్లు ఒక లింక్ పంపారు. వందకు రెండు వందలు, రెండు వందలకు నాలుగు వందలు డబ్బులు వస్తాయని అందులో ఆశచూపారు. దీంతో బాధితుడు ఆ లింక్‌ను క్లిక్ చేశాడు. అంతే.. క్షణాల్లోనే బ్యాంకు ఖాతాలోని రూ.96వేలు వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. దీంతో బాధితుడు లబోదిబోమంటూ మరుసటి రోజు మంగళవారం ఘన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ముష్క రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డబ్బులు ఆశచూపుతూ వాట్సాప్‌లకు వచ్చే లింక్‌లను ఎవరూ క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ వలలో చిక్కకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గంజాయి కేసులో ఒడిస్సా వాసికి పదిన్నర ఏళ్ల జైలు



కేసముద్రంలో గంజాయి కేసులో అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సత్యనారాయణ (ఫైల్)

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జూలై 16 : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఒరిస్సాకు చెందిన వ్యక్తికి పదిన్నరేళ్ల జైలు శిక్షను మహబూబాబాద్ జిల్లా జడ్జీ పి.చంద్రశేఖరప్రసాద్ విధించినట్లు కేసముద్రం ఎస్ఐ వంశీధర్ మంగళవారం తెలిపారు. గత ఏడాది అక్టోబర్, 16న కేసముద్రం స్టేషన్ గాంధీసెంటర్‌లో రూ.4 లక్షల విలువైన 16.29 కిలోల గంజాయిని ఒరిస్సా రాష్ట్రం గంజం జిల్లా పెరగడ గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ ప్రధాన్ అనే వ్యక్తి తరలిస్తుండగా, అదేరోజు పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఎస్ఐ కోగిల తిరుపతి తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ దామోదర్ పంచనామా నిర్వహించగా ఎస్ఐ తిరుపతి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పటి డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేష్ సమక్షంలో నిందితున్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జీ చంద్రశేఖర ప్రసాద్ నిందితునికి పది సంవత్సరాల ఆరునెలల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.1లక్ష జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ వివరించారు. గంజాయి కేసులో నిందితునికి శిక్షపడేలా చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

వరంగల్ కేఎంసీలో 'సూపర్' సేవలు దూరం

సమయానికి విధులకు రాని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు

సేవల కోసం రోగుల పడిగాపులు



వైద్యుల కోసం పడిగాపులు కాస్తున్న రోగులు

వరంగల్ మెడికల్, జూలై 16 : వరంగల్ కాకతీయ మెడికల్ వైద్య కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సూపర్ సేవల కోసం రోగులు పడిగాపులు కాస్తున్నారు. వైద్యులు సమయం పాటించకపోవడంతో వైద్యం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పేద రోగుల బాగోగులు చూడాల్సిన వైద్యులు వేళాపాళా లేకుండా విధులకు హాజరు కావడం ఇబ్బందిగా మారుతోంది. మంగళవారం ఉదయం అనేక విభాగాల్లో వైద్యులు రాకపోవడంతో గంటల తరబడి వార్డుల్లోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజూ 12 గంటల వరకు ఓపీ ఉంటుండగా.. డాక్టర్ల కోసం నిరీక్షించాల్సిందేనని రోగులు వాపోతున్నారు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తమ గోడు పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో రోస్టర్ విధానం ద్వారా సూపర్ సేవలు అందుతున్నాయి. మంగళవారం న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ విభాగానికి వచ్చే రోగులను లోనికి తీసుకెళ్లేందుకు కనీసం స్ట్రెచర్లు కూడా అందుబాటులో లేవు.

డాక్టర్లు ఎప్పుడు వస్తారనే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు కూడా కనిపించడం లేదు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ దగ్గరికి కొందరు వెళ్లగా ఎంజీఎంలో రోగులను చూసి ఇక్కడకు వస్తారని సమాధానం ఇస్తున్నారని రోగులు పేర్కొంటున్నారు. కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సమయం పాటించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

హత్య కేసు నిందితుల లొంగుబాటు

పరారీలో ప్రధాన నిందితుడు



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న జనగాం వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్

వర్ధన్నపేట, జూలై 16: భూమి కొనుగోలు విషయంలో జరిగిన గొడవలో హత్య చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు జనగామ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ముగ్గురి నిందితులను హాజరుపర్చారు. అనంతరం డీసీపీ హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయపర్తి మండలం బురహాన్‌పల్లికి చెందిన సూదిళ్ల దేవేందర్, అదే గ్రామానికి చెందిన పల్లె మల్లేశంనకు భూమి కొనుగోలు విషయంలో గొడవలు జరుగుతున్నాయన్నారు. 2022లో పల్లె మల్లేశంపై హత్యాయత్నం చేసిన కేసులో దేవేందర్ అతని అనుచరులపై న్యాయస్థానంలో కేసు నడుస్తోందని తెలిపారు. ఈక్రమంలో దేవేందర్, మల్లేశంను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతోపాటు హత్య చేయడానికి యత్నిస్తుండడాన్ని మల్లేశం గ్రహించాడు. ఈక్రమంలో ఈనెల 7న దేవేందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకున్న మల్లేశం, ఆయన కుమారుడు మురళి, బొందిళ్ల చెన్నారాయుడు, హర్షన్ గోవింద్‌తో కలిసి ఇంట్లోకి ప్రవేశించి సుత్తితో కొట్టి చంపారు. హత్యకేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పల్లె మురళి పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురు నిందితులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. ప్రధాన నిందితుడు మురళి కోసం మూడు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు. సమావేశంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుగోలుకు డీఎంహెచ్‌వో

కాలినడకన వెళ్లి ఆదివాసీలకు వైద్యం అందించిన అప్పయ్య



పెనుగోలు గుట్టలు ఎక్కుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వాజేడు, జూలై 16: ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య ఎంతో శ్రమకోర్చి తన వృత్తిధర్మాన్ని నిర్వర్తించారు. వాజేడు మండల పరిధి తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్యంలో ఎలాంటి రవాణా సౌకర్యం లేని కుగ్రామానికి కాలినడకన వెళ్లి ఆదివాసీలకు వైద్యం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వాజేడుకు వచ్చిన ఆయన సిబ్బందితో కలిసి గుమ్మడిదొడ్డి మీదుగా మూడు వాగులు, గుట్టలు దాటుకుంటూ సుమారు 17 కిలోమీటర్లు నడిచి పెనుగోలుకు వెళ్లారు. గుట్టలపై నివసిస్తున్న ఆదివాసీలకు వైద్య పరీక్షల నిమిత్తం బయల్దేరారు. మంగళవారం రాత్రి పెనుగోలులో బస చేసి బుధవారం ఆదివాసీలకు వైద్యపరీక్షలు, దోమ తెరలను పంపిణీ చేయనున్నారు. ఎనుగోలు గుట్టలకు డీఎంహెచ్‌వో వెళ్లడం ఇదే ప్రథమం. ఆయన వెంట వాజేడు వైద్యాధికారి మహేందర్, హెచ్‌ఏ చిన్నవెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఏటూరునాగారం రూరల్ : ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో అప్పయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌లో పేర్కొన్న విధంగా ఆస్పత్రులను నడపాలని సూచించారు. పేషెంట్ కేస్ షీట్‌లో వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరచాలని, అనుమతులున్న మేరకే బెడ్స్ స్థాయి ఉండాలన్నారు. ఆసత్రిర ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సంక్రమణ వ్యాధులకు సంబంధించిన రోగా నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ వస్తే వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు వివరాలను తెలియచేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రులకు నోటీసు జారీ చేశారు.

ప్రాణం తీసిన హైవే గుంత

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

జాతీయ రహదారిపై బంధువుల ఆందోళన



శీనివాస్ (ఫైల్)

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 16 : జాతీయ రహదారి 365పై ఏర్పడిన గుంత కారణంగా ఒకరి ప్రాణం పోగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి మరిపెడలోని గంగా వైన్స్ సమీపంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, కుటుంబసభ్యులు ఘటనాస్థలి వద్ద ఆందోళన చేశారు. మరిపెడ పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. వీరారం గ్రామానికి చెందిన తాళ్ల శ్రీను, ఆయన కుమారుడు రాకేశ్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మరిపెడలోనిహైవేపై ఏర్పడిన గుంతలో వారి ద్విచక్రవాహనం పడడంతో వాహనం అదుపుతప్పి కిం దపడగా తండ్రి శ్రీను (45) అక్కడికి అక్కడే మృతి చెందగా, కుమారుడు రాకేశ్ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన మృతుడి బంధువులు ఘటనాస్థలం వద్ద ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి ఎన్‌హెచ్‌ఏ అధికారులు న్యాయం చేయాలని నినదించారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చచెప్పి, శాంతింప చేశారు. వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్న శ్రీనుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చిరువ్యాపారి హత్య కేసులో ఒకరి అరెస్ట్

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జూలై16 : కేసముద్రం విలేజి పూలే సెంటర్ సమీపంలో ఈనెల 14న సాయంత్రం చోటు చేసుకున్న జిలుకర నాగరాజు హత్య కేసులో, ఇదే గ్రామానికి చెందిన వల్లందాసు నగేష్‌ను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. స్థానికంగా తీవ్ర సంచలనం రేపిన కేసులో అరెస్ట్ వివరాలను కేసముద్రంలో రూరల్ సీఐ మంగళవారం వెల్లడించారు. పూలే సెంటర్ సమీపంలో చిన్నడబ్బా ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న వల్లందాసు నగేష్‌కు జిలుకర నాగరాజుతో కొంతకాలంగా వ్యక్తిగత కక్ష ఏర్పడింది. గతనెల రోజులుగా నాగరాజును హతమార్చాలని నగేష్ ప్రయ త్నాలు చేస్తూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. నాగరాజు అనుమానంతో నగేష్‌తో జాగ్రత్తగా ఉంటు న్నాడు. ఈ క్రమంలో ఆదివారం నగేష్ భార్య అనారోగ్యంతో బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం నాగరాజు డబ్బాదుకాణం వద్దకు నగేష్ మద్యం సేవించి, వచ్చాడు. ఇదే అదనుగా భావించిన నగేష్ తన డబ్బా దుకాణం వెనుకనే ఉన్న ఇంట్లోకి మద్యం తాగుదామని నాగరాజును పిలిచాడు. అప్పటికే నాగరాజు మద్యం సేవించి ఉండడంతో అనుమానం లేకుండా నగేష్ ఇంట్లోకి వెళ్లాడు. అక్కడ నాగరాజుకు మరికొంత మద్యాన్ని నగేష్ పోశాడు. నాగరాజు మద్యం బాగా సేవించిన అనంతరం నగేష్ వెంటనే నాగరాజు తలపై కర్రతో బలంగా కొట్టగా, ఆ దెబ్బకు నాగరాజు కిందపడిపోయాడు. ఆ తర్వాత కాలితో నాగరాజు మెడపై తొక్కడంతో ఊపిరి ఆడక నాగరాజు మృతి చెందాడు. ఆ వెంటనే నగేష్ అక్కడి నుంచి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోగా, పూర్తి విచారణ అనంతరం ఆధారాలను సేకరించి నిందితున్ని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపినట్లు రూరల్ సీఐ తెలిపారు.

సోమ్లాతండాలో ఘనంగా సీత్లా పండుగ

● ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు



పర్వతగిరి సోమ్లాతండాలో సీత్లా పండుగ వేడుకలో పాల్గొన్న భూక్యా మురళీనాయక్ దంపతులు

మహబూబాబాద్ టౌన్, జూలై16 : మండలంలోని పర్వతగిరి సోమ్లాతండాలో మంగళవారం గిరిజనులు సీత్లా పండుగను ఘనంగా జరుపుకున్నారు. సొంతూరు సోమ్లాతండాలో స్థానిక శాసనసభ్యుడు భూక్యా మురళీనాయక్, ఉమా దంపతులు గిరిజనులతో కలిసి సీత్లా భవానీకి ప్రత్యేక పూజలు చేశారు. తండావాసులు పెద్దఎత్తున తరలివచ్చి సీత్లా భవానీ మాతకు మొక్కులు చెల్లించి, పూజలు చేశారు. పశు సంపద చల్లగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధి పండాలని సీత్లా భవానీ మాతను ఎమ్మెల్యే వేడుకున్నారు. తన సొంత గ్రామంలో తండావాసులతో కలిసి పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందనిఅన్నారు. తండావాసులు ఇస్లావత్ బాలాజీ, రాంచందర్, నారాయణసింగ్, భూక్య మంగిలాల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● గూడూరు : పేదల సంక్షేమమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో 28 మందికి రూ.28.32లక్షల కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు.తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో చంద్రమోహన్, నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ నరేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, కొమ్మాలు, శ్రీపాల్‌రెడ్డి, మధు పాల్గొన్నారు. అనంతరం మచ్చెర్లలో పార్టీ కార్యకర్త కొట్టెం సమ్మయ్య మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

ముస్లిం మహిళలకు సహాయం..

గూడూరులోని ముస్లిం మహిళలు ఎమ్మెల్యేమురళీనాయక్ విజయం సాధించాలని గత అసెంబ్లీ ఎన్నికల్లో మొహరం సందర్భంగా మొక్కుకున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు సదరు మహిళలు తెలపడంతో వారికి రూ.7వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి

● ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



యశస్వినిరెడ్డిని సన్మానిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

తొర్రూరు, జూలై 16 : మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరకాలుగా కృషి చేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మదర్ థెరిస్సా మండల సమాఖ్య వార్షిక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకుఅనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీతో రుణం మంజూరు, మహిళలు వ్యాపారంలో అభివృద్ధి చెందేందుకు సంక్షేమ పథకాలు రాయితీలో అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పరిధిలోని 29 గ్రామాల్లో ఉన్న సంఘాల్లో ఉన్న మహిళలందరూ ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. మహిళలందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. మహిళా సంఘాలకు సుమారు రూ. 20 కోట్ల రుణాలను విడుదల చేశారు. యశస్వినిరెడ్డిని మహిళా సంఘాలు శాలువా, మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 16 : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వనమహోత్సవంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం, సమృద్ధిగా నీరు లభించాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. విద్యార్థులకు కూడా ఇళ్లలో మొక్కలునాటి వాటిని సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన గాలిని పొంద వచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మమత, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రామా రత్నమాల, బొంద్యాలు, రాజేందర్, సుజిత్‌రెడ్డి, రాంరెడ్డి,నరహరి, హతిరామ్, కానీం, సుమన్, వీరు, సంతోష్‌రెడ్డి, సంతోష్‌కుమార్, రామన్న, బోధనేతర సిబ్బంది శివజ్యోతి, కమలాకర్, రాజేందర్, సునిత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వెదురు రైతులకు రాయితీ విడుదల

● జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 16 : జిల్లాలోని నర్సింహులపేట, మానుకోట మండలాలకు చెందిన ఐదుగురు వెదురు రైతులకు రూ.1.49 లక్షల ప్రోత్సాహక రాయితీలు ప్రభుత్వం నుంచి విడుదల అయ్యాయని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మరియన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. వెదురు పెంచే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహక రాయితీలు అందిస్తుందని వివరించారు. రైతు పొలాల్లో బ్లాక్ ప్లాంటేషన్ కింద వెదురు తోటలు పెంచితే మూడేళ్లకుగాను రూ.20 వేల రాయితీ అలాగే రైతు పొలంగట్లపై బౌండ్రీ ప్లాంటేషన్ పెంచితే రూ.15600 రాయితీ లభిస్తుందని చెప్పారు. రెతులు గమనించి, వెదురు తోటలు పెంచాలని ఆయన సూచించారు.

లక్ష మందికి రూ.2 లక్షల రుణమాఫీ అవకాశం

(5వ పేజీ తరువాయి)

బకాయిలు ఉన్న పంట రుణాలను కటాఫ్ తేదీగా ప్రభుత్వం ప్రకటించింది. బ్యాంకులు, సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను పౌరసరఫరాలశాఖ ఆహారభద్రత కార్డు (పీడీఎస్) డేటాబేస్, ప్రామాణికంగా తీసుకున్నట్లు సర్కార్ ప్రకటించింది. రేషన్‌కార్డు ప్రామాణికంతో చాలా మంది రైతులకు రుణమాఫీఅవకాశాలు చేజారుతున్నాయి. ఒక కుటుంబంలో కుమారుడు వేరుపడితే అతడికి కూడా రేషన్‌కార్డు ఉన్నట్లైతేనే రుణమాఫీ వర్తిస్తుంది. కుటుంబ యజమానిగా ఉండి రేషన్‌కార్డు ఉన్నవారికి రుణమాఫీ వర్తిస్తుంది. కుటుంబం లో భార్య, భర్తలిరువురు బ్యాంకు రుణాలు తీసుకుని ఉంటే భార్యకు మొదటి ప్రాధాన్యతనిస్తారు. భార్య పేరిట రూ.1.50 లక్షలు రుణమాఫీ అయితే మిగిలిన రూ.50 వేలు భర్త రుణం నుంచి మాఫీ అవనున్నాయి. రూ.2 లక్షలకుపైగా బ్యాంకు రుణం ఉంటే రూ. 2లక్షలు మాత్రమే మాఫీ కానున్నాయి. మిగిలిన నగదును బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ రిటర్న్ చెల్లించే వారికి రుణమాఫీ వర్తించదు.

గీత కార్మికుడికి గాయాలు

ఇనుగుర్తి, జూలై 16 : గీత కార్మికుడు గాయాల పాలైన సంఘటన మంగళవారం ఇనుగుర్తిలో చోటు చేసుకుంది. ఇనుగుర్తికి చెందిన వేముల చిన్నయాదగిరి తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి తాటిచెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. యాదగిరిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తీగలవేణి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు

గూడూరు, జూలై 16 : తీగలవేణి పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో మండలంలోని తీగలవేణి, మదనాపురంలలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆరోగ్య సమస్యలపై బాధపడుతున్న 82 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది షానుబేగం, రమేష్, వెంకటేశ్వర్లు, పుష్ప, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోడు సాగుకు అడ్డు తగలొద్దు

● ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



పోడు సాగు రైతులతో మాట్లాడుతున్న కోరం కనకయ్య

బయ్యారం, జూలై 16 : హక్కులు కలిగి వంశపారపర్యంగా దశాబ్దాల తరబడి వ్యవసాయం చేస్తున్న పోడు రైతుల సాగుకు అడ్డు తగలొద్దని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సంబంధి అధికారులకు సూచించారు. పట్టా ఉన్నభూముల్లో పలువురు గిరిజన రైతులు సాగు చేస్తుంటే ఇటీవల ఫారెస్టు అధికారులు అడ్డుతగిలిన సంగతి తెలిసిందే. దీంతో మంగళవారం ఆయన కాచనపల్లి, సాంభతండా, వందిపంపుల గ్రామాల్లోని పోడు సాగు భూములను ట్రాక్టర్‌పై వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు పోడు రైతులు తమ గోడును ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. 2005 ఏడాదికి ముందు నుంచే తాము పోడుసాగు చేస్తున్నామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూములకు పట్టాలు కూడా మంజూరు చేసిందని పేర్కొన్నారు. అయినప్పటికి క్షేత్రస్థాయి ఫారెస్టు అధికారులు సాగు చేసుకోనివ్వకుండా అండంకులు సృష్టిస్తు న్నారని వాపోయారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ నిబంధనల ప్రకారం హక్కులు కలిగిన భూముల్లో పోడు సాగును అడ్డుకునేందుకు ఎవరికి అధికారం లేదన్నారు. ఏజన్సీ ప్రాంతాల్లో ఉత్పన్నమవుతున్న పోడుసమస్యను ఇప్పటికే సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుం దని పోడు రైతులకు హామీ ఇచ్చారు. బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, మిర్యాలపెంట ఎంపీటీసీ సభ్యు డు సనప సోమేష్, కాంగ్రెస్ నాయకులు కంబాల ముసలయ్య, ప్రవీణ్‌నాయక్, వేల్పుల శ్రీనివాస్ పోడు రైతులు ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బయ్యారం సీఐ రవికుమార్ నేతృత్వంలో ఎస్సై ఉపేందర్, పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి

నెహ్రూసెంటర్, జూలై 16 : జిల్లాలో ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో కృషి చేయాలనిడీఎంఅండ్‌హెచ్‌వో బి.కళావతిబాయి సూచించారు. మహబూబాబాద్ ఐఎంఏ హాల్లో మంగళవారం ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి ఉపకేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి మురికి నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, తమ ఇంటి ఆవరణలో మురుగునీరు నిలువ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు పెరిగే ప్రాంతాలను పూడ్చివేయాలన్నారు. ఆగస్టు 10 నుంచి 25 వరకు డీఈసీ, ఆల్బెండజోల్, ఐరన్ మెట్రిన్ మందులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అంబరీష, నాగేశ్వర్‌రావు, సుధీర్‌రెడ్డి, శిరీష, పురుషోత్తం, కేవీ రాజు, గీత, వడ్డెబోయిన శ్రీనివాస్, షాహిముద్దీన్ పాల్గొన్నారు.

ఉర్సుగుట్టపై పీరీల మట్టిలకు ప్రార్థనలు



పీరీల మట్టిలకు ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 16 : బేతోలులో ఉర్సుగుట్టపై పీరీల మట్టిలకు మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేతోలు గ్రామంలోని ఉర్సు గుట్టపై ఉన్న మహబూబ్ సుభాని దర్గా. అగ్నిగుండం వద్దమట్టిలతో తిరు గుతూ ప్రతీ ఒక్కరు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. జిల్లా కేంద్రం శివారులోని భజన తండా, మాన్సింగ్‌తండా, చంద్రన్న కాలనీల్లో పీరీలను ఊరేగి స్తుండగా భక్తులు రంగుల దట్టీలు, కుడకలు, బెల్లం, ఊదు, కానుకలు సమర్పించారు. ఆయా వేడుకల్లో ముస్లిం మత పెద్దలు, మొహరం కమిటీ సభ్యులు షేక్ యాసుఫ్, మస్తాన్, మదార్, లతీఫ్, బాలసైదు, ఖాదర్‌బాబా, పాషా, జావిద్, షరీఫ్, షబ్బీర్, ఖాజాపాషా, నజీర్, రహీం, జానీ, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

మహబూబాబాద్ టౌన్, జూలై 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ పిడుగు వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. పులుగుజ్జు వెంకన్న, దుండి ఐలయ్య, నర్సయ్య, మల్లయ్య, రాములు, మునేందర్, అంజ య్య, రాజేష్, శ్రీకాంత్, విక్రం, భిక్షం, నాగేష్, నాగరాజు పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

మహబూబాబాద్ టౌన్, జూలై16 : ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారికి పట్టాలివ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ డిమాండ్ చేశారు. భూ పోరాట కేసులో మహబూబాబాద్ కోర్టులో మంగళవారం సీపీఐ నేతలు హాజరయ్యారు. పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, పోచారం కృష్ణ పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి పరామర్శ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 16 : అనారోగ్యానికి గురైనప్పుడు ఆత్మస్థైర్యంతో ఉండాలే కానీ మనోధైర్యం కోల్పోకూడదని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంచంద్రు ఇటీవల పక్షవాతంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకుని మంగళవారం మానుకోట శివారు బాబునాయక్‌తండాలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించి రూ. 6 వేల ఆర్థిక సాయం అందించారు. డీఈవో కార్యాలయంలో సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఫణీ రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. డీఈవో వెంట సతీష్ ఉన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

● టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్



అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న టీఎన్జీవోస్ నేతలు, మార్కెటింగ్ ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, జూలై 16 : మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవోస్) యూనియన్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ ఉద్యోగులు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగులకు బదిలీలు నిర్వహించాలని కోర్టు స్టేటస్‌కో తీసుకురావడం జరిగిందన్నారు. పి.సంతోష్ కుమార్, అమర్‌లింగేశ్వర్, నిరంజన్, రాజేంద్రప్రసాద్, రమేష్, ఇందిర, కుమారస్వామి, లలిత, ఐలయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కేసముద్రం, జూలై 16 : తాళ్లపూసపల్లిలో ఊడుగుల ఉప్పలయ్య జనగాం రామాచారి వేర్వేరుగా ఇటీవలె మృతి చెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ మంగళవారం పరామర్శించారు. ఇరు కుటుంబాలకు 50కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు. అనంతరం కేసముద్రం స్టేషన్‌లో అనారోగ్యంతో మృతి చెందిన మిత్తింటి రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రావుల మురళి తండ్రి సత్యనారాయణ సంవత్సరికం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, బండారు దయాకర్, ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షుడు కూరెళ్లి సతీష్ పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

గూడూరు, జూలై 16 : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమస్యల పరిష్కారం కోసం హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెనుక ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో డీడీ ఎర్రయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముయ్యబోయిన వెంకన్న, రేగ పాపారావు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేయాలి

కురవి, జూలై 16 : కురవి బస్టాండులో రహదారికి మరమతులు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కురవి బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి, మాట్లాడారు. తక్షణమే బస్టాండులో సీసీ రహదారి వేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు కొలిపాక వీరేందర్, శరత్, కార్తీక్, వినయ్, వినయ్, ప్రవీణ్, రవీందర్, అనిల్, ఉదయ్ పాల్గొన్నారు.

'అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

సీరోలు, జూలై16 : మండలకేంద్రానికి చెందిన మందాడి రాజేష్‌ను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్న డిమాండ్ చేశారు. సీరోలుకు చెందిన మందాడి రాజేష్‌ను ఎస్సీ కులం పేరుతో దూషించినందుకు నిరసనగా సీరోలులో మంగళవారం నిరసన చేపట్టారు. అనంతరం మహబూబాబాద్‌లో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు వినతి పత్రం అందజేశారు. రాజేష్, సైదులు, సహదేవ, కమలాకర్, లింగన్న, నరేష్, మహేష్, శ్రీకాంత్, సంపత్, రాజు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

సీరోలు, జూలై 16 : పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని డాక్టర్ నిఖిల అన్నారు. కొత్తూరు (సి)లో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్ మొదలగు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీరునిల్వ ఉండకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. వైద్యశిబిరంలో ఆశా కార్యకర్తలు శైలజ, కళమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

● నలుగురిపై కేసు నమోదు

● నాలుగు ద్విచక్రవాహనాలు సీజ్

నెహ్రూసెంటర్, జూలై 16 : మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం గుడుంబా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో నలుగురిపై కేసు నమోదు చేసి, నాలుగు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి 18 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. డోర్నకల్ మండలం తెల్లబండతండాకు చెందిన జాటోతు లక్ష్మా, కురవి మండలం చంద్యాతండాకు చెందిన భూక్య రాజు, మహబూబాబాద్ మండలం బోడగుట్ట తండాకు చెందిన భూక్య మల్సూర్, భూక్య నరేష్ గుడుంబా విక్రయిస్తున్న వీరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీలు

మరిపెడ రూరల్, జూలై 16 : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మంగళవారం ఎల్లంపేట, వీరారంలో 'అంగన్‌వాడీ-అమ్మ బడి, అమ్మమాట- అంగన్‌వాడీ బడిబాట' కార్యక్రమంలో భాగంగా ఊరంతా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండున్నర సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరినీ సమీపంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారి, గంట కవిత, శ్రీవాణి, సీఏలు రజిత, గీత, ఆశావర్కర్ జ్యోతి, జీపీ కార్యక సురేష్, కారోబార్ హుస్సేన్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిస కావొద్దు

● కొత్తగూడ సీఐ బాబురావు

కొత్తగూడ, జూలై 16 : యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని, గ్రామస్థులకు ఏవైనా చట్టపరమైన సమస్యలుంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని, అనుమానితులు గ్రామాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కొత్తగూడ సీఐబాబురావు సూచించారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు దొరవారివేంపల్లి, కర్నెగండి గ్రామాల్లో మంగళవారం పోలీసులు పర్యటించారు. అనంతరం యువకులకు పలు క్రీడాసామగ్రి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడ, గంగారం ఎస్ఐలు దిలీప్, రవికుమార్ పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వీరబాబు



మరిపెడ రూరల్, జూలై 16 : యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బుర్హాన్‌పురానికి చెందిన పెద్దబోయి న వీరబాబును నియమించినట్లు ఆ సంఘ జాతీయ కో కన్వీనర్ వంగూరి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

మరిపెడ, జూలై 16 : వ్యవసాయ కూలీలకు కనీస వేతనచట్టాన్ని అమలు చేసి, రోజుకు రూ.600వేతనం ఇవ్వాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని పలు లేబర్ కాలనీలో ఆయన కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి కనీస వేతనచట్టం, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ అనంతాచారి, అల్వాల మస్తాన్, కూలీలు పాల్గొన్నారు.

'భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలి'

పెద్దవంగర, జూలై 16 : నేటి మహిళలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని, ఏదైనా సాధించగలమన పట్టుదలతో ముందుకు వెళ్లాలని ఏపీడీ జయశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో లక్ష్యం సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిరుధాన్యాలతో తయారు చేసే ఆహార పదార్థాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఎం నళినిరియణ, చంద్రశేఖర్, ఏపీఎం రమణచారి, సీసీలు సుధాకర్, పద్మ, సుజాత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దాశరథి శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్ రావు

చిన్నగూడూరు, జూలై 16: దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని దాశరథి సోదరుల విగ్రహప్రాంగణాన్ని వివిధ పార్టీల నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో శతజయంతి ఉత్సవాల సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జూలై 22న దాశరథి స్వగ్రామం చిన్నగూడూరు నుంచి మహబూబాబాద్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి, జిల్లా కేంద్రంలోని ఎస్.వి ఫంక్షన్ హాల్‌లో శతజయంతి ప్రారంభ సభ, కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ సభకు ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, కవి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కవి నందిని సిధారెడ్డి, హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

దాశరథి ఉత్సవ కమిటీ ఎన్నిక

దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు రవీందర్ రావు, గౌరవ సలహాదారులుగా రావుల రాంరెడ్డి, అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, సభ్యులుగా లక్ష్మణ్, నీలం శంకరయ్య, దొంగరి నర్సయ్య, నారాయణ తదితరులను ఎన్నుకున్నారు. మునిసిపల్ చైర్మన్ వెంకన్న, వార్డు కౌన్సిలర్ వేణు, వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న, ప్రమోద్‌రెడ్డి, నర్సయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

తొర్రూరు, జూలై 16: ముదిరాజ్‌లను బీసీ - డీ నుంచి బీసీ- ఏ జాబితాలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల అధ్యక్షుడు కొత్తూరి రమేష్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్యకు వినతిపత్రం అందించారు. నాయకులు అలువాల సోమయ్య, జి.వెంకన్న, పిచ్చయ్య, యాకన్న, రాంచంద్రు, ప్రభాకర్, వెంకన్న, ఉపేందర్, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● నర్సింహులపేట : ఐక్యఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ అన్నారు. ముదిరాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నర్సింహులపేటలో ముదిరాజ్‌లు భారీ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. వెంకన్న, సైదులు, నర్సయ్య, వీరయ్య, శ్రీను, రామ్మూర్తి, సత్యం, సుధాకర్ పాల్గొన్నారు.

అంతరాష్ట్ర దొంగ అరెస్టు

● 15 క్వింటాళ్ల నల్లబెల్లం, 2 క్వింటాళ్ల పటిక స్వాధీనం

● పెద్దవంగర ఎస్సై బానోతు మహేష్

పెద్దవంగర, జూలై 16 : కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వం నిషేధించిన నల్లబెల్లం సరాఫరా చేస్తున్న అంతరాష్ట్ర నలబెల్లం దొంగ అరెస్టు చేసినట్లు ఎస్సై బానోతు మహేష్ తెలిపారు. మంగళవారం రాత్రి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. పెద్దవంగర మండలంలోని ఎల్‌బీ తండాకు చెందిన జాటోతు రాజు ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా నల్లబెల్లం, పటికను తీసుకువచ్చి తొర్రూరు, పెద్దవంగర మండలలో వ్యాపారం చేస్తున్నాడు. అదే తరహాలో ఎల్‌బీతండాలో జాటోతు రాజు ఇంట్లో నిల్వ ఉంచిన రూ.1.36 లక్షలు విలువ చేసే 15 క్వింటాళ్ల నల్లబెల్లం, 2క్వింటాళ్ల పటిక స్వాధీనం చేసుకోని జాటోతు రాజుపై కేసు నమోదు చేసి తొర్రూరు మెజిస్ట్రేట్ హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. జాటోతు రాజు పలు కేసులలో నిందితుడి ఉండి తప్పించుకొని తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుదాకర్, ఈర్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.